క్లుప్తంగా

రైతులు వివరాలు నమోదు చేసుకోవాలి



నాగిరెడ్డిపేట: మండలంలోని గోలిలింగాలలో బుధవారం ఏఈవో ప్రశాంత్‌కుమార్ ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పట్టా ఉన్న రైతుల ఆధార్ నంబర్, మొబైల్ నంబర్ ద్వారా ఆయన ఫార్మర్ రిజిస్ట్రీ చేశారు. దేశంలో ప్రతి పౌరునికి గుర్తింపు ఇచ్చినట్లుగానే ప్రతి రైతుకు 11నంబర్లతో కూడిన విశిష్టసంఖ్య(యూనికోడ్)ని కేటాయించాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించిందని ఏఈవో తెలిపారు. భూమి కలిగిన ప్రతి రైతు తనకు ఉన్న భూములకు సంబంధించిన వివరాలతో ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని సూచించారు.

పుస్తె, మట్టెల వితరణ



కామారెడ్డి టౌన్: కామారెడ్డి పట్టణ కేంద్రానికి చెందిన గీతాంజలి వివాహానికి కావాల్సిన పుస్తె, మట్టెలను ఆర్యవైశ్య సంఘ సభ్యులు బుధవారం వితరణ చేశారు. పేద కుటుంబం కావడంతో పుస్తె, మట్టెలను అందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాంత్ గుప్తా, గోవింద్ భాస్కర్ గుప్తా, వలిపిశెట్టి లక్ష్మీరాజ్యం, విశ్వనాధుల మహేశ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

శివనామ స్మరణతో మానసిక ప్రశాంతత



గాంధారి: శివనామ స్మరణతో మానసిక ప్రశాంతత నెలకొంటుందని రంగంపేట పీఠాధిపతి మాధవనంద సరస్వతి అన్నారు. మండల కేంద్రంలోని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శివ భక్త మార్కండేయ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజైన బుధవారం ఆలయంలో మార్కండేయ విగ్రహ ధ్వజ, శిఖర ప్రతిష్ఠ, ప్రత్యేక పూజలు చేపట్టారు. పురోహితులు సంతోష్, వేద పండితులు పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్, సంఘం పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



పెద్దకొడప్‌గల్: మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను తహసీల్దార్ దశరథ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సంజీవ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శిక్షణ తరగతులు



లింగంపేట: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సమ్మర్ క్యాంప్‌లో భాగంగా బుధవారం కరాటే శిక్షణ తరగతులు నిర్వహించినట్లు కోర్సు ఇన్‌చార్జి వహీద్‌సిద్దిఖీ తెలిపారు. కరాటే శిక్షణలో భాగంగా విద్యార్థులకు మెలకువలు నేర్పారు. కార్యక్రమంలో నిపుణులు, ఉపాధ్యాయులు ప్రభాకర్, రాజులు, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన



రాజంపేట: శివాయపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఐకేపీ డీపీఎం రమేశ్ బాబు బుధవారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో ఇప్పటి వరకు 69 మంది రైతుల నుంచి 2623 క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించి రైస్ మిల్లులకు తరలించినట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని వేగవంతంగా తూకం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఐకేపీ సిబ్బంది రాజేందర్, సాయిలు, గ్రామ అధ్యక్షురాలు లక్ష్మి ఉన్నారు.



బస్వాపూర్‌లో భూమి పూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు



గజ్యానాయక్ తండాలో..



సీతారాంపూర్‌లో భూమిపూజ చేస్తున్న నాయకులు

పేదల సొంతింటి కల నెరవేరుస్తాం

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు
- గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ



తాడ్వాయి: ఎర్రాపహాడ్‌లో ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

తాడ్వాయి: పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు అన్నారు. తాడ్వాయి మండలంలోని ఎర్రాపహాడ్‌లో బుధవారం నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల మార్కింగ్ కార్యక్రమానికి ఆయన హాజరై భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని, ఇందిరమ్మ ఇళ్ల పంపిణీతో పేదల సొంతింటి కల నెరవేరుతోందని అన్నారు. ఎర్రాపహాడ్‌లో 33 మందికి ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. అలాగే గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకోవాలని సూచించారు. ఎంపీడీవో సయ్యద్ సాజిద్‌అలీ, హౌసింగ్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామపెద్దలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు

భిక్కనూరు: అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం భిక్కనూరు మండలం బస్వాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి వారు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో నాయకులు బల్యాల సుదర్శన్, బీంరెడ్డి, సిద్ధరాములు, తుడుం జీవన్, వంక కిరణ్, ఎల్లం, మల్లేశం, మిద్దె లోకేశ్, బాబు, చందు, రాజేశ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

గజ్యానాయక్ తండాలో..

మాచారెడ్డి: మండలంలోని గజ్యానాయక్ తండాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మండల ప్రత్యేకాధికారి రమేశ్ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల కమిటీ అధ్యక్షుడు బన్సీలాల్, పంచాయతీ కార్యదర్శి జీవన్ తదితరులు పాల్గొన్నారు.

సీతారాంపూర్‌లో..

దోమకొండ: పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి అన్నారు. మండలంలోని సీతారాంపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు తాటిపల్లి శ్రీకాంత్, సంతోష్‌రెడ్డి, సత్యనారాయణ, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, జీపీ కార్యదర్శులు రాములు, లింగం, రమేశ్, రాజు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరెపల్లిలో..

రాజంపేట: ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి అపర్ణ సూచించారు. రాజంపేట మండలం ఆరెపల్లిలో ఇందిరమ ఇళ్లకు భూమి పూజ, మార్కింగ్ వేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఘురాం, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జాన్కంపల్లిలో..

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలంలోని జాన్కంపల్లిఖుర్దులో ఎంపీడీవో ప్రకాశ్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. అనంతరం వారికి మంజూరైన ప్రతాలను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీబీపేటలో..

బీబీపేట: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ అన్నారు. బీబీపేట మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్లకు బుధవారం ముగ్గు పోశారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్మాణాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్, తహసీల్దార్ సత్యనారాయణ, పాత రాజు, సుతారి రమేశ్, భూమాగౌడ్, సలీం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

కామారెడ్డి రూరల్: మండలంలోని చిన్నమల్లారెడ్డిలో బుధవారం ఆలయ వార్షికోత్సవంలో భాగంగా వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి వారి ఉత్సవమూర్తులను గ్రామంలో ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు శ్రీ మేనేపల్లి నర్సింహాచార్యులు, ఆలయ అర్చక సిబ్బంది, కార్య నిర్వాహకులు పరాంకుశాచార్యులు, అఖిలేశ్, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు లింగాపూర్‌లో...

కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్‌లో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వార్షికోత్సవం సందర్భంగా గురువారం స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



ఎల్లారెడ్డిరూరల్: మల్లాయిపల్లి గ్రామంలో సీసీ రోడ్డు పనులను ఏఎంసీ చైర్‌పర్సన్ రజిత బుధవారం ప్రారంభించారు. పనులు నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సాయిబాబా, నాయకులు వెంకట్రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సామెల్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



ఎల్లారెడ్డి: మండలంలోని తిమ్మారెడ్డిలో చాకలి మీనాకు మంజూరైన రూ. అరవై వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు బాధిత కుటుంబానికి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహారెడ్డి, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి



నిజాంసాగర్: అకాల వర్షంతో ధాన్యం తడిసిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర నేత పైడి ఎల్లారెడ్డి కోరారు. బుధవారం మహమ్మద్‌నగర్ మండలం సర్వ గ్రామ కొనుగోలు కేంద్రంలో అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. కేంద్రంలో సరైన వసతులు లేవని దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఆయన వెంట హైమారెడ్డి, గొర్గంటి రాములు, రాంప్రసాద్ గుప్తా, సాయిబాబా ఉన్నారు.

రూ. 4.4 లక్షలు పలికిన వేలం



నిజాంసాగర్: మండలంలోని అచ్చంపేట మత్స్య శాఖ కార్యాలయ ఆవరణలో బుధవారం కౌలాస్ నాలా ప్రాజెక్టులో చేపలు పట్టేందుకు మత్స్య శాఖ అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. చేపల వేటకు నలుగురు కాంట్రాక్టర్లు వేలంలో పాల్గొనగా ఎండీ జాఫర్ రూ. 4.40 లక్షలకు వేలం దక్కించుకున్నట్లు మత్స్య శాఖ ఎఫ్‌డీవో డోలిసింగ్ తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ జిల్లా అధికారి శ్రీపతి, మత్స్య పారిశ్రామ సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్లకు స్పందన



బాన్సువాడ రూరల్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఫార్మర్ ఐడీ విధానంలో బుధవారం మండలంలోని సోమేశ్వర్‌లో రిజిస్ట్రేషన్లు చేపట్టినట్లు బాన్సువాడ క్లస్టర్ ఇన్‌చార్జి ఏఈవో ప్రియాంక తెలిపారు. ప్రతి రైతుకు డిజిటల్ గుర్తింపు కార్డు జారీ చేసేందుకు వివరాలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన కిసాన్ సమ్మాన్‌నిధి, ఫసల్‌బీమా యోజన, హెల్త్‌కార్డులకు ఈ వివరాల నమోదు తప్పని సరి అని ఆమె అన్నారు. రైతులు తమ వివరాలను తప్పకుండా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు.

జేఏసీ చైర్మన్‌కు పరామర్శ



జగన్నాథం, జేఏసీ నేతలతో ఎమ్మెల్సీ కోదండరాం

కామారెడ్డి టౌన్: కామారెడ్డి జేఏసీ చైర్మన్, ప్రముఖ న్యాయవాది జగన్నాథం ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో ఎమ్మెల్సీ కోదండరాం బుధవారం ఆయనను పరామర్శించారు. అలాగే టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రమణ ఇటీవల మృతి చెందడంతో కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట క్యాతం సిద్దిరాములు, రజనీకాంత్, నీలనాగరాజు, పూల్‌సింగ్, మల్లన్న తదితరులు ఉన్నారు.

శుభకార్యానికి హాజరైన కోదండరాం

తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు కుంబాల లక్ష్మణ్ యాదవ్ ఇంట్లో జరిగిన శుభ కార్యానికి టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాం హాజరయ్యారు. కార్యక్రమంలో నిజ్జన రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటిన ఆర్టీసీ సిబ్బంది



ఆర్టీసీ సిబ్బందిని సన్మానిస్తున్న డిపో మేనేజర్

బాన్సువాడ రూరల్: బాన్సువాడ ఆర్టీసీ డిపోకు చెందిన సిబ్బంది నిజాయితీ చాటుకున్నారు. డిపోకు చెందిన బస్సు మంగళవారం రాత్రి బాన్సువాడ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరింది. అందులో ఓ ప్రయాణికుడు హైదరాబాద్ సమీపంలో రూ. 50వేల నగదుతో ఉన్న బ్యాగును బస్సులో మరిచి పోయి దిగిపోయాడు. కొంత సేపటికి గమనించి వెంటనే బాన్సువాడ డిపో మేనేజర్ సరితాదేవికి ప్రయాణికుడు ఫోన్‌లో ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందించిన డీఎం బస్సు డ్రైవర్, కండక్టర్‌కు ఫోన్ చేశారు. బస్సులో బ్యాగ్ కనిపించడంతో హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్ బస్టాండ్‌లో అక్కడి ఆర్టీసీ అధికారుల సమక్షంలో నగదుతో ఉన్న బ్యాగ్‌ను ప్రయాణికుడికి అప్పగించారు. బుధవారం బాన్సువాడ డిపోలో మేనేజర్ సరితాదేవి కండక్టర్ బీమాతోపాటు డ్రైవర్ రామకృష్ణలను సన్మానించి అభినందించారు. ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు



నిజాంసాగర్: మద్యం సేవించి వాహనాలు నడపొద్దని నిజాంసాగర్ ఎస్సై శివకుమార్ వాహనదారులకు సూచించారు. బుధవారం మహమ్మద్‌నగర్ మండలం బొగ్గు గుడిసె చౌరస్తా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. కొందరు మద్యం సేవించి పట్టుబడడంతో వారికి కౌన్సెలింగ్ ఇచ్చి జరిమానా విధించారు. వాహనదారులు తప్పనిసరిగా వాహన ధ్రువీకరణ పత్రాలను తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



సదాశివనగర్: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు మద్దెల బాగయ్య ఇటీవల దళిత రత్న అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం బాగయ్యను జిల్లాలోని వివిధ మండలాల దళిత సంఘాల ప్రతినిధులు, జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వివిధ మండలాల దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం



బాణాపూర్‌లో ఎంవీఏ పీటీఆర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు



నూతనంగా నిర్మించిన గోదాంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు

లింగంపేట: ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు అన్నారు. బుధవారం లింగంపేట మండలం బాణాపూర్ సబ్‌స్టేషన్‌లో రూ. కోటితో ఏర్పాటు చేసిన 3.15 ఎంవీఏ పీటీఆర్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలనే ఉద్దేశంతో లోఓల్టేజీ సమస్యను నివారిస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో చుట్టు పక్కల ఎనిమిది గ్రామాలకు ఓల్టేజీ సమస్య తీరుతుందన్నారు. అలాగే మండలంలోని ఒంటర్‌పల్లి ఎస్సీ కాలనీ నుంచి గట్టుమైసమ్మ తండా వరకు బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రైతులకు ఉచిత కరెంటు, రైతు భరోసా, గృహాలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, రమేశ్, రఫియొద్దీన్, సందీప్, నగేశ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలి

ఎల్లారెడ్డి రూరల్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎల్లారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రతి కార్యకర్త ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. నియోజకవర్గంలో సర్పంచులు, ఎంపీటీసీల స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకునేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ రావు, ఏఎంసీ చైర్‌పర్సన్ రజితా రెడ్డి, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు సాయాగౌడ్, నారాగౌడ్, శ్రీధర్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోదాంల నిర్మాణాలకు శంకుస్థాపన

గాంధారి: గాంధారి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో గుర్జాల్, పేట్‌సంగెం గ్రామాల్లో గోదాంల నిర్మాణాలకు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు బుధవారం శంకుస్థాపన చేశారు. నేరల్ తండాలో నూతనంగా నిర్మించిన గోదాంను ప్రారంభించారు. కార్యక్రమాల్లో డీసీసీబీ డైరెక్టర్ సాయికుమార్, వైస్ చైర్మన్ ఉదల్ సింగ్, ఏఎంసీ చైర్మన్ పరమేశ్, సొసైటీ డైరెక్టర్లు దొల్లు సాయిలు, గాండ్ల లక్ష్మణ్, సంతోష్ కుమార్, అశోక్ రెడ్డి, శివాజీ రావు, ముకుంద్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే పూజలు

పిట్లం: మండలంలోని గౌరారం తండాలో భవాని మాత, సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ మందిర్ వార్షికోత్సవ ఉత్సవాలను తండావాసులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావుతో పాటు మహారాష్ట్ర ఎమ్మెల్సీ బాబూసింగ్ మహారాజ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బంజారా సంఘం నాయకులు, తండా పెద్దలు పాల్గొన్నారు.

పట్టింపు లేని పల్లె ప్రకృతి వనం



నస్రుల్లాబాద్: మండలంలోని రాములగుట్ట జీపీ పరిధిలో ఉన్న నాచుపల్లి తండాలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం పై అధికారుల పట్టింపు లేదు. వనంలో ఉన్న మొక్కలు ఎండి పోయి మోడుగా మారుతున్నాయి. సాయంత్రం సేద తీరడానికి ప్రకృతి వనానికి వెళ్లాలంటే కనీస వసతులు కరువయ్యాయి. అధికారులు స్పందించి పల్లె ప్రకృతి వనాన్ని ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

సంక్షిప్తం

బీఆర్‌ఎస్‌పై అసత్య ఆరోపణలు మానుకోవాలి

బాన్సువాడ రూరల్: రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన బీఆర్‌ఎస్ పార్టీ, మాజీ సీఎం కేసీఆర్‌పై జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు అసత్యపు ఆరోపణలు చేయడం మానుకోవాలని ఆ పార్టీ నాయకులు మన్నె అనిల్, మమ్మాయి లక్ష్మణ్ సూచించారు. బుధవారం మండలంలోని బోర్లం గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా తప్పించుకుని తిరుగుతోందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన 15నెలల్లో జుక్కల్ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనుల ఏమిటో తెలపాలని అన్నారు.

ఆలయంలో సీసీ కెమెరాల ఏర్పాటు

దోమకొండ: మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఎస్సై స్రవంతి తెలిపారు. ఆలయంలో దొంగతనాల నివారణకు ఆలయ కమిటీ ప్రతినిధులతో చర్చించి సీసీ కెమెరాలను ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఆలయ కమిటి ప్రతినిధులు నర్సారెడ్డి, మోహన్‌రెడ్డి, సాయిరెడ్డి, బాల్‌రాజ్, వెంకటేశం, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలుడికి రక్తదానం

కామారెడ్డి అర్బన్: తలసేమియా వ్యాధితో బాధపడుతున్న కార్తిక్ అనే ఎనిమిదేళ్ల బాలుడికి ఏ పాజిటివ్ రక్తం అవసరం కాగా తలసేమియా సికిల్ సొసైటీ ద్వారా అందించినట్లు రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్త బాలు బుధవారం తెలిపారు. అన్ని దానాల్లో కన్నా రక్తదానం ఎంతో గొప్పదని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని ఆయన కోరారు.

18న రక్తదాన శిబిరం

బాన్సువాడరూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఈనెల 18న రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఏఎస్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అయ్యాల సంతోష్ రావు తెలిపారు. మాతాశిశు ఆస్పత్రిలో రక్తనిల్వలు తగ్గిపోవడంతో గర్భిణులు, బాలింతలకు రక్తం అందుబాటులో ఉంచడానికి శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

కామారెడ్డి రూరల్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమంలో భాగంగా చిన్నమల్లారెడ్డిలో గురువారం ఇళ్ల నిర్మాణ పనులను ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ ప్రారంభిస్తారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ లక్ష్మీరాజాగౌడ్ బుధవారం తెలిపారు. కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

ఉత్తమ విద్యుత్ ఉద్యోగులకు ప్రోత్సాహకాలు

కామారెడ్డి అర్బన్: విద్యుత్ ఉద్యోగుల మధ్య స్నేహపూర్వక పోటీ తత్వాన్ని పెంచి వివిధ అంశాల్లో అత్యుత్తమ ప్రతిభకనబర్చిన వారికి బెస్ట్ పెర్ఫామెన్స్ ఆఫ్ ది మంత్ పేరిట ప్రోత్సాహక జ్ఞాపికలను అందజేయనున్నట్లు ఎస్‌ఈ శ్రావణ్ కుమార్ తెలిపారు. వినియోగదారులకు మరింత మెరుగైన నాణ్యమైన సేవలు అందించడానికి బాగా పనిచేస్తున్న సిబ్బందిని ప్రోత్సహించడానికి బెస్ట్ పెర్ఫామెన్స్ ఆఫ్ ది మంత్ ప్రోత్సాహం ఉపయోగపడుతుందని భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా, డీటీఆర్ నివారణ, నిర్వహణ, వైఫల్యాల తగ్గింపు, సత్వర సేవ, ఎనర్జీ ఆడిట్, పనుల రాబడి పెంచడం, రెవెన్యూ వసూళ్లు, పారామీటర్ల ఆధారంగా శక్తి సామర్థ్యాలను గుర్తించనున్నట్లు ఎస్‌ఈ వివరించారు.